ప్రజాశక్తి

గురువారం 6 నవంబరు 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



సమావేశంలో ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కలెక్టర్లు డాక్టర్ జి.లక్ష్మీశ, డి.కె.బాలాజీ తదితరులు

బందరు రోడ్డు విస్తరణలో మార్పులు

- ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీ
- మూడు డిజైన్లను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిని (ఎన్‌హెచ్ 65) ఆరు వరుసలుగా విస్తరించే ప్రతిపాదనల్లో మార్పులు అవసరమని ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కలెక్టర్లు డాక్టర్ జి.లక్ష్మీశ, డి.కె.బాలాజీ అభిప్రాయపడ్డారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్లో బుధవారం ఎన్‌హెచ్ 65 విస్తరణ ప్రతిపాదనలపై ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజా ప్రతినిధులు, ఎన్‌హెచ్‌ఎఐ, మెట్రో రైల్ అధికారులతో సమావేశం జరిగింది. కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ ఎన్‌హెచ్ 65 విస్తరణకు మెట్రో అధికారులతో కలిసి మూడు ఆకృతులను (డిజైన్లను) సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత ఆకృతి బెంజ్ సర్కిల్ నుంచి చినఓగిరాల వరకు ఉన్న ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించలేదన్నారు. పతిపాదిత వెహికల్ అండర్ పాస్ (వియుసి)ల పెంపుపై అధ్యయనం చేయాలన్నారు. కలెక్టర్ డి.కె.బాలాజీ మాట్లాడుతూ విజయవాడ నగర శివారు ప్రాంతాల నుంచి ట్రాఫిక్ పెరుగుతోందని, పోర్ట్ ట్రాఫిక్ కూడా కలిస్తే మరింత రద్దీగా మారుతుందని, అందువల్ల ఎలివేటెడ్ కారిడార్‌పై దృష్టి సారించాలని అన్నారు. జనావాసాలు లేని చోట డ్రైనేజీలు నిర్మించలేదని, దీనివల్ల సమస్యల ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. ఒఆర్‌ఆర్, మెట్రో ప్రాజెక్టులతో ఎన్‌హెచ్ 65 విస్తరణను ముడి పెట్టొదన్నారు. ఎంఎల్‌ఎలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్, వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ ఎన్‌హెచ్ 65ను ఎన్‌హెచ్ 16 తో అనుసంధానించాలని, ఇందుకోసం మూడుచోట్ల రహదారులు నిర్మించాలని సూచించారు. వెహికల్ అండర్‌పాస్‌లను పెంచాలని, రహదారిపై వీధిదీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. కొన్ని అండర్ పాస్‌లలో నీరు నిలుస్తోందని, దీనిపై ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు దష్టి సారించాలని చెప్పారు. అన్ని కూడళ్లలో బెల్‌మౌత్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈసమావేశంలో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల సంయుక్త కలెక్టర్లు ఎస్.ఇలక్కియ, ఎం.నవీన్, ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీ నరసింహం, విజయవాడ ఆర్డిఒ చైతన్య, ఎన్‌హెచ్‌ఎఐ పీడీ విద్యా సాగర్ పాల్గొన్నారు.

తుది జాబితాపై కసరత్తు !

- తుపాను నష్టం లెక్కల్లో అధికారులు బిజీబిజీ
- ఆర్‌ఎస్‌కెల్లో సోషల్ ఆడిట్‌కు అవకాశం
- నేడు ఎపిఎఐఎంఎస్ యాప్‌లోకి తుది జాబితా
- 33 శాతానికిపైగా నష్టపోయిన పంటలకే జాబితాలో చోటు
- పరిహారంతో సంబంధం లేకుండా ధాన్యం సేకరణ

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

మొంథా తుపాను పంట నష్టం తుది జాబితాపై వ్యవసాయశాఖ కసరత్తు చేస్తోంది. ఈ క్రాప్ సక్రమంగా జరగలేదని, ఎన్యూమరేషన్‌లో లోపాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పొరపాట్లకు తావులేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 33 శాతానికిపైగా నష్టపోయిన పంటల వివరాలతో తుది జాబితాలను రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ జాబితాలను జిల్లాలోని 318 రైతు సేవా కేంద్రాల్లో సోషల్ ఆడిట్ (సామాజిక తనిఖీ) చేసుకునే అవకాశం కల్పించారు. రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత జాబితాల్లో లోపాలను సవరించి ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఎపి ఎఐఎంఎస్) యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేస్తారు. నష్ట పరిహారంతో సంబంధం లేకుండా బాధిత రైతుల నుంచి ధాన్యం సేకరించనున్నట్లు తాజాగా కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ప్రకటించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

తుది జాబితాపై కుస్తీ

మొంథా తుపానుకు కృష్ణాజిల్లాలో 54,180 మంది రైతులకు సంబందించి 45,041 హెక్టార్లలో వరి పంటకు, 1,860 మంది రైతులకు సంబంధించి ఇతర వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. నష్టశాతంతో సంబంధం లేకుండా ప్రాథమిక అంచనాలను రూపొందిస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నేలవాలిన వరి పొలాన్నే పరిగణలోకి తీసుకుంటారు. 33 శాతానికిపైగా నష్టం వాటిల్లిన పంటల వివరాలనే తుది జాబితాలో నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రాథమిక జాబితాతో పోలిస్తే తుది జాబితాలో నష్టపోయిన భూముల విస్తీర్ణం, రైతుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉంది. నేలవాలిన వరి పొలాలను మాత్రమే ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటోంది. తుపాను ఈదురుగాలులకు నిలబడిన వరి పొలాల్లోని వరి కంకులు సుంకు రాలిపోయింది. తప్ప కంకులు దర్శనమిస్తున్నాయి. దిగుబడులు ఎకరాకు



సగటున 75 కిలోల బస్తాలు 33 రావాల్సి ఉండగా, తుపాను సమయంలో పాలు పోసుకునే దశలో ఉండి ప్రస్తుతం నిలబడిన కనిపిస్తున్న వరి పొలాల్లోనూ దిగుబడులు సగానికిపైగా తగ్గిపోతాయని రైతులు చెబుతున్నారు. 15 బస్తాలకు మించి దిగుబడులు రావని, నిబంధనలు సడలించి పాలుపోసుకోకుండా తప్పకంకులు వచ్చిన వరిపొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తుది జాబితాలో నమోదు చేయాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రైతులు వినతిపత్రాలు సమర్పించారు. అయితే దీనిపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

బాధిత రైతుల నుంచి ధాన్యం సేకరణ!

పంట నష్టపరిహారం చెల్లించిన భూముల్లో పండించిన ధాన్యాన్ని సేకరించబోమని ప్రభుత్వ యంత్రాంగం ప్రకటించింది. తాము పండించిన విస్తీర్ణంలో 40 శాతం మాత్రమే పంటకు నష్టం వాటిల్లిందని రైతులు నమోదు చేయించుకున్నారు. 60 శాతం విస్తీర్ణాన్ని తగ్గించి రాయించుకున్నారు. ఈ విస్తీర్ణంలోని ధాన్యాన్ని ప్రభుత్వం ద్వారా విక్రయించుకోవచ్చనే కారణంతో పంట విస్తీర్ణాన్ని తగ్గించి నమోదు చేయించుకున్నట్లు పలువురు చెబుతున్నారు. పంట నష్టం తుది జాబితా రూపకల్పన చివరి దశలో ఉండగా బాధిత రైతుల నుంచి ధాన్యం సేకరిస్తామని ప్రకటించింది.

కార్పొరేటర్ల విజ్ఞాన యాత్ర రద్దు

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ కార్పొరేటర్ల విజ్ఞానయాత్ర అర్ధాంతరంగా రద్దయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు యాత్ర రద్దయినట్లు అధికారులు, పలువురు కార్పొరేటర్లు చెబుతున్నారు. విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్‌తోపాటు టిడిపి ఎంఎల్‌ఎలకు పర్యటన వ్యవహారం ఇష్టం లేకపోవడంతోపాటు కూటమి కార్పొరేటర్లు సైతం దీనికి దూరంగా ఉండాలని హుకం జారీ చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ యాత్రను రద్దు చేసేలా పావులు కదిపినట్లు తెలిసింది. బడ్జెట్ లేనందున కార్పొరేటర్ల విజ్ఞాన యాత్రను రద్దుచేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని విఎంసి సెక్రటరీ, సర్కిల్-2 జోనల్ కమిషనర్ ప్రభుదాస్ ప్రజాశక్తికి వివరించారు. యాత్రకు అయ్యే వ్యయాన్ని విఎంసి ఇంజినీరింగ్ విభాగం చూస్తుందని చెప్పారు. ఈనెల 6 నుంచి యాత్రకు వెళ్లేందుకు వైసిపి, టిడిపి కూటమి కార్పొరేటర్లు మొత్తం 44 మంది ప్లాన్ సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. వీరిలో 29 మంది వైసిపి, 15 మంది టిడిపి కూటమి కార్పొరేటర్లు ఉన్నట్లు తెలిసింది. మరో ఐదుగురు విఎంసి సిబ్బంది కూడా ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే విమాన టికెట్లు కూడా బుక్ చేసుకున్నట్లు తెలిసింది. ముంబయి, పూణే, బరోడా, అహ్మదాబాద్, జైపూర్, రాజ్‌కోట్ కార్పొరేషన్లతోపాటు పలు పుణ్యక్షేత్రాలు, తీర్థా స్థలాలు, యాత్రా స్థలాలకు వెళ్లేలా 15 రోజుల పర్యటన ఏర్పాట్లకు ప్లాన్ చేసుకున్నట్లు తెలిసింది. సుమారు రూ.82 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేసి, ముందుగా విమాన టికెట్లకు రూ.20 లక్షల వరకు డ్రా చేసి, ఖర్చు చేసినట్లు తెలిసింది. అయితే మొదటి నుండీ సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు ఇటువంటి యాత్రలకు దూరంగా ఉంటున్నారు.

జగన్ పరామర్శ యాత్రలో రైతులేరీ? : మంత్రి కొల్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : రైతులను పరామర్శించే పేరుతో వైసిపి అధినేత వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి అబద్దాల యాత్ర చేశారని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గహంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ తుపాను వచ్చిన తొమ్మిది రోజుల తర్వాత జగన్ ఎవరిని పరామర్శిస్తారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏ ఒక్క రైతుకూ నష్ట రానీయదని, ఇప్పటికే అన్ని చర్యలు తీసుకుందని చెప్పారు. తుపాను వల్ల నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఇప్పటికే ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రంలో రూ.5,600 కోట్ల నష్టం వాటిల్లినట్టు కేంద్రానికి నివేదికలు పంపినట్లు చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కష్ట పడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి ఎలా పడితే అలా మాట్లాడితే సహించేది లేదన్నారు. రైతులను ఆదుకోకుండా చంద్రబాబు లండన్ వెళ్లారని జగన్ చేసిన వ్యాఖ్యలను మంత్రి ఖండించారు. అసలు జగన్‌కు వ్యవసాయం గురించి తెలియదన్నారు. రైతుల పట్ల కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. మచిలీపట్నం నియోజకవర్గం కోన గ్రామానికి చెందిన గంగ వెంకటేశ్వరావు అనే రైతును



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

తీసుకొచ్చి గూడూరులో మాట్లాడించారని, ఇది వైసిపి దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాలవులు పూడిక తీయడంతో ఎక్కడా నీళ్ళు నిలబడలేదన్నారు. ఇప్పటికే ఈ క్రాప్ 99 శాతం పూర్తి చేశామన్నారు. కౌలు రైతులను తప్పకుండా ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. వైసిపి ప్రభుత్వ హయాంలో పంటల బీమా ఎప్పుడు ఇచ్చారో చెప్పాలన్నారు. మీడియా సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల జగన్నాథరావు, జనసేన నగర అధ్యక్షులు గడ్డం రాజు, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచే నాని, మాజీ మున్సిపల్ చైర్మన్, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లోగిశెట్టి వెంకటస్వామి, బచ్చుల అనిల్ కుమార్, మాజీ జడ్‌పిటిసి సభ్యులు లంకె నారాయణ ప్రసాద్, బిజెపి నాయకులు పంతం వెంకట గజేంద్ర రావు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధితో మరొకరు మృతి

ప్రజాశక్తి - ఎ.కొండూరు : ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలెం గ్రామపంచాయతీ శివారు దీప్లానగర్ తండాకు చెందిన కిడ్నీ వ్యాధి బాధితుడు భరోతు ధర్మ (45) మంగళవారం రాత్రి మృతిచెందాడు.



చీమలపాడులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టినా తన భర్త దక్కలేదని భార్య కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. మృతుని మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలను విఆర్‌ఒ రాణి అందజేశారు.

కిడ్నీ వ్యాధి మరణాలను నివారించాలి : సిపిఎం

ఎ.కొండూరు మండలంలో కిడ్నీ వ్యాధితో వరస మరణాలు సంభవిస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని సిపిఎం మండల కార్యదర్శి పానెం ఆనందరావు విమర్శించారు. భరోతు ధర్మా మృతదేహాన్ని పానెం ఆనందరావుతోపాటు సిపిఎం నాయకులు జెట్టి వెంకటేశ్వరరావు, ఆళ్ల అమ్మిరెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మాళావతు కుమార్ నాయక్ సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ రెండుమూడు రోజుల వ్యవధిలోనే చైతన్యనగర్‌లో బాణావతు రాముడు, దీప్లానగర్ తండాలో జరపల మంగ్యా నాయక్, భరోతు ధర్మ కిడ్నీ వ్యాధితో మరణించారని చెప్పారు. కిడ్నీవ్యాధి బాధితులకు సరైన వైద్యం, పోషకాహారం అందక మరణాలు సంభవిస్తున్నాయని విమర్శించారు. ఎ.కొండూరులో కిడ్నీ ఆస్పత్రిని వెంటనే నిర్మించాలని, వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు అందించాలని, కష్ణా జలాల సరఫరా ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్ త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. 2.0 క్రియాటిన్ దాటిన కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం పెన్షన్ ఇవ్వాలని, డయాలసిస్ చేయించుకుంటున్న వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.20 వేలు పెన్షన్ పెంచాలని కోరారు.



ఆదరణ 3.0 ద్వారా ఆధునిక పరికరాలు : మంత్రి సవిత

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : బిసిలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఆదరణ 3.0 ద్వారా ఆధునిక పనిముట్లు అందిస్తామని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. గొల్లపూడిలోని బిసి సంక్షేమ భవన్లో రాష్ట్ర వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ ఆధ్వర్యంలో బిసి కార్పొరేషన్ చైర్మన్లు, కుల సంఘాలు, డైరెక్టర్లతో ఆదరణ 3.0 పథకం అమలుపై జరుగుతున్న మూడు రోజుల వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత మాట్లాడుతూ అందరి సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని ఆదరణ 3.0 పథకాన్ని అమలు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం బిసిలకు పాలనలో పెద్దపీట వేస్తోందన్నారు. కుల, చేతివత్తుల వారికి ఆధునిక పరికరాలతో శాశ్వత ఉపాధి కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అంతకుముందు 17 బిసి కార్పొరేషన్ల చైర్మన్లతో మంత్రి సవిత సమావేశమయ్యారు. బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంగినపూడి బీచ్లో కార్తీక శోభ : మంత్రి కొల్లు

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్ : కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగినపూడి బీచ్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం తెల్లవారు జామున 5 గంటలకు మంత్రి మంగినపూడి బీచ్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సముద్ర స్నానమాచరించారు. అనంతరం బాణాసంచాను కాల్చారు. బీచ్‌లో ప్రజలతో మాట్లాడి ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. ఐసిడిఎస్ విభాగాన్ని సందర్శించి చిన్న పిల్లలకు వేడివేడి పాలు అందజేశారు. పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. తదనంతరం శ్రీ దత్త రామేశ్వరాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రజలు పెద్దఎత్తున సముద్ర స్నానాలకు వచ్చారు. దీంతో బీచ్ కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి వివి నాయుడు, జిల్లా పర్యాటక అధికారి రామ్ లక్ష్మణ్, డిఎస్‌పి సిహెచ్ రాజా, తహశీల్దారు నాగభూషణం, ఎంపిడిఒ వెంకటేష్, అర్బన్ బ్యాంకు చైర్మన్ దిలీప్ కుమార్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పివి ఫణి కుమార్, మెరైన్ ఎస్ఐ సుభాష్ చంద్రబోస్, విద్యుత్ శాఖ ఎఇ రామకష్ణ, జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రసాదం పంపిణీ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

సామాజిక న్యాయ మహాశిల్పాన్ని వ్యాపార దృష్టితో చూడొద్దు

సిఎంఒ కార్యదర్శి కెవిపిఎస్ బృందం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : అంబేద్కర్ స్మృతి వనాన్ని వ్యాపారం దష్టిలో కాకుండా పర్యాటక దష్టిలో చూసి నిధులు కేటాయించి నిర్వహణ అభివద్ధి కోసం శాశ్వత నిధి ఏర్పాటు చేయాలని సిఎంఒ కార్యదర్శి రాజమౌళికి కెవిపిఎస్ ప్రతినిధి బందం విజ్ఞప్తి చేసింది. కెవిపిఎస్ ప్రతినిధి బృందం బుధవారం ఆయనను కలిసి పలు అంశాలపై వినతిపత్రం సమర్పించింది. ఈసందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, రాష్ట్ర నాయకులు జొన్నకూటి నవీన్ ప్రకాష్ తదితరులు మాట్లాడుతూ విజయవాడ స్వరాజ్య మైదానంలో ఏర్పాటుచేసిన సామాజిక న్యాయ శిల్పం భారతరత్నం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ప్రభుత్వం పట్టించుకోవడంలేదని సిఎంఒ కార్యదర్శికి వివరించారు. సామాజిక న్యాయ శిల్పాన్ని అభివద్ధి చేయటంలో జరుగుతున్న జాప్యంతోపాటు అక్కడ నెలకొన్న కొన్ని ప్రతికూల అంశాలను చంద్రమౌళి దష్టికి తీసుకుతీసుకెళ్లారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల తీరుతున్నలను ఆయన దష్టికి తెచ్చారు. డప్పు కళాకారులకు, శ్మశానాల్లో పనిచేస్తున్న కాటికాపర్లకు గుర్తింపు కార్డులు ఇచ్చి పెన్షన్ సౌకర్యం కల్పించాలని, డబ్బు కళాకారులకు గతంలో ఇచ్చిన గుర్తింపు కార్డులను కొనసాగించాలని కోరారు. ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేసి అర్జీలు పెట్టుకున్న వేలాది మందికి ఎస్‌సి కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలని, ఎస్‌సి బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర శ్మశాన వాటికల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రతినిధి బందంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు నాయుడు, ప్రకాష్ పాల్గొన్నారు.

ఐఅండ్‌పిఆర్ డైరెక్టర్‌ను కలిసిన ఎపిడబ్ల్యుజెఎఫ్ నేతలు

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కె.ఎస్.విశ్వనాథన్‌ను బుధవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలను నేతలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎంబి.నాథన్, మైలవరం నియోజకవర్గ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాల్మన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఐఅండ్‌పిఆర్ డైరెక్టర్ విశ్వనాథన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్

ఘనంగా ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఎన్‌టిఆర్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్, నగర నాయకులు నగర నాయకులు జె.వి.శ్రీనివాస్, విహెచ్.రాజు, శేఖర్, బాషా, మైలవరం నియోజకవర్గ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాల్మన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మురళీ నాయక్‌కు స్వర నివాళి

విజయవాడ : పాక్‌తో పోరులో అసువులు బాసిన యువ జవాన్ మురళీ నాయక్ కు నివాళి అర్పిస్తూ చెల్లూరి శివయ్య నిర్వహణలో బుధవారం రాత్రి స్థానిక గాంధీనగర్ కౌతా పూర్ణానందం వేదికపై సినీ సంగీత విభావరి జరిగింది. పలువురు గాయకులు ఆయా సినిమాల్లోని పాటలతో ప్రేక్షకుల్ని అలరించారు. ప్రముఖ వాస్తు పండిట్ తల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, మల్లాది స్వాతి, అయ్యప్పన్, శోభారాణి, జయంతి చక్రవర్తి, ఎ.జయప్రభు, శ్యాంప్రసాద్, శోభారాణి, ఝాన్సీ, లక్ష్మణ్ నాయక్, జయంతి చక్రవర్తి, బెజవాడ బాషా సహా దాదాపు ఇరవై మంది గాయనీ గాయకులు వివిధ సినిమాల్లోని పాటలను జనరంజకంగా పాడి ప్రేక్షకుల్ని ఆహ్లాద పరిచారు. కే డేవిడ్ రాజు, సీహెచ్ చిట్టిబాబు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

సినీ సంగీత విభావరి

విజయవాడ : మధు స్వరమాలిక సమర్పణలో 'ఏ దివిలో విరిసిన పారిజాతమో' మకుటంతో బుధవారం రాత్రి గాంధీనగర్ ఆశిష్ స్టూడియోలో సినీ సంగీత విభావరి జరిగింది. ప్రముఖ ఔత్సాహిక గాయనీ గాయకులు ఉమా మాధవి (టీం లీడర్), శ్యామ్, ఫణి ఓరుగంటి, శ్రీకాంత్, ఫల్గుణ్, రఘుపతి, సత్యనారాయణ, సుమలత, శైలజ, టి కె శ్రీనివాస్ సహా దాదాపు 20 మంది వివిధ సినిమాల్లోని పాటలను ఆలపించి ప్రేక్షకుల్ని అలరించారు. సూర్య ట్రాక్స్ సహకారంతో గాయనీ గాయకులు సంతృప్తి చెందారు.

త్రీవీలర్ మోటారు సైకిళ్లకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు శారీరక దివ్యాంగులకు మూడు చక్రాల మోటారు వాహనాలు మంజూరు పథం కింద ఆన్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభా వంతుల, వయో వృద్ధుల సహాయ సంస్థ.కృష్ణాజిల్లా సహాయ సంచాలకులు, జిల్లా మేనేజర్ వి. కామ రాజు తెలిపారు. అనుకూల వాహనం నడపడానికి అవసరమైన డ్రైవింగ్ లైసెన్స్ ఉండి, రెగ్యులర్ డిగ్రీ, ఆపై ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు, పదో తరగతి ఉత్తీర్ణులై స్వయం ఉపాధితో జీవిస్తూ రాష్ట్రానికి చెందినవారై ఉండాల న్నారు. ఈ నెల 25 వ తేదీ నాటికి 18 నుండి 45 ఏళ్ల లోపు ఉండి 70 శాతం లోకోమోటర్ వికలాంగత కలిగి ఉన్నవారు, వార్షిక కుటుంబ ఆదాయం రూ. 3 లక్షల కంటే ఎక్కువ ఉండరాదని, దీనికి దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులు అని పేర్కొన్నారు. ప్రభుత్వం లేదా ప్రైవేటు సంస్థల ద్వారా ఇంతకు ముందు ఏ మోటరైజ్డ్ వాహనాన్ని పొందకూడదన్నారు. అలాగే తన పేరుపై వాహనం ఉండకూడదని, ఈ ప్రయోజనం జీవితంలో ఒక్కసారి మాత్రమే పొందగలరన్నారు. అర్హులైన వారు, పూర్తి వివరాలకు www.apdascac.ap.gov.in అనే వెబ్‌సైట్ లో ఆన్‌లైన్ ద్వారా 25 నవంబరు లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

యాడ్ పర్పస్



కౌండిన్య మహర్షి జయంతి

ప్రజాశక్తి-కంకిపాడు : యనమలకుదురులోని రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్ కార్యాలయంలో కౌండిన్య మహర్షి జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కౌండిన్య మహర్షి చిత్రపటానికి శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు కౌండిన్య మహర్షి జయంతిని అధికారికంగా కూటమి ప్రభుత్వం నిర్వహించే విధంగా ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి ప్రయత్నం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరంకి కుటుంబరావు, జన్ను నాగరాజు, ఆరేపల్లి దాసు, ఈడే శ్రీనివాసరావు, అనగాని కొండలరావు, బలగం కొండ, భూక్యరాజా, పరిసే గోపి, రామని యువరాజు, చిర్రావూరి శేషు, భూగ బాలస్వామి సబ్జా ఏడుకొండలు పాల్గొన్నారు.

దళితులపై దాడి అమానుషం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలంలోని బండ్లమూడి గ్రామంలో జరిగిన దళితులపై దాడి రాష్ట్రంలోని దళితుల భద్రత పరిస్థితిపై మరోసారి అనుమానాలు రేకెత్తుతున్నాయని వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నలుపుర్తి రమేష్ తెలిపారు. బుధవారం ఆయన అవనిగడ్డలో విలేకరులతో మాట్లాడుతూ బండ్లమూడి గ్రామానికి చెందిన టిడిపి గ్రామ నాయకుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎస్సి సామజ వర్గానికి చెందిన కుటుంబాలపై దాడి చేయడం హేయమైన చర్య అని, ఇది ప్రజాస్వామ్య చరిత్రలో మాయని మచ్చగా నిలిచిపోతుందన్నారు. తమ పొలంలో ఎందుకు గొర్రెలను మేపుతున్నారు అని అడిగిన కారణంతో యేసుదాసు కుటుంబంపై పోలీసుల సమక్షంలోనే దాడి చేయడం, కులహంకార పాలనకు నిదర్శనం అన్నారు. ఈ దాడిలో ఆరుగురు ఎస్సీలు గాయాలతో ఒంగోలు రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, ఇంత పెద్ద దారుణ ఘటనకు కారణమైన వ్యక్తులపై ఇప్పటికీ చర్యలు లేకపోవడం దురదష్టకరమన్నారు. అందువల్ల పోలీసులు బాధితుల పక్షాన నిలబడి దాడికి పాల్పడిన టిడిపి గ్రామ నాయకుడు శ్రీనివాసుల రెడ్డి, అతని అనుచరులను అరెస్టు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు రమేష్ తెలిపారు.

ఆలయాలు కిటకిట

ప్రజాశక్తి-చల్లపల్లి : కార్తీక పౌర్ణమి కావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చల్లపల్లిలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశి విశ్వేశ్వర స్వామి వారి దేవాలయం, లక్ష్మీపురంలోని శ్రీ దుర్గా పార్వతీ సమేత సోమేశ్వర స్వామి వారి దేవాలయం, నడకుదురు శ్రీ పద్దేశ్వర స్వామి దేవాలయం, పాగోలు శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ప్రజాశక్తి గుడ్లవల్లేరు : మండలంలోని డోకిపర్రుశ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం కోటి వత్తికా దీపోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పీవీ కృష్ణారెడ్డి, సుధ దంపతుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ. పీ నాగిరెడ్డి, ప్రసన్న, నాగేశ్వర రెడ్డి, వెంకటలక్ష్మి దంపతులు, ఇతర కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు పాల్గొన్నారు. కోటి వత్తికా దీపోత్సవంలో పాల్గొన్న వారికి అవసరమైన పూజా సామాగ్రిని ఆలయ ధర్మకర్తలు కష్ణారెడ్డి, సుధ దంపతులు ఉచితంగా అందచేశారు. .అలాగే కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా మచిలీపట్నం, మంగినపూడి బీచ్‌లో కొండలమ్మ అమ్మవారి దేవస్థానం నుండి 300 కేజీలు పులిహోర ప్రసాద వితరణ బుధవారం పంపిణీ



గుడ్లవల్లేరు మండలంలో డోకిపర్రు ఆలయంలో దీపోత్సవం

చేసినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు తెలిపారు. అదేవిధంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రాతః కాలమున శ్రీ అమ్మవార్లకు పంచామతాభిషేకము అనంతరం 9 గంటల నుండి అమ్మవారి సన్నిధిలో రుద్ర సహిత చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోడూరు : కార్తీక పౌర్ణమి సందర్భంగా హంసలదీవి బీచ్ వద్దకు భక్తులు తరలివచ్చారు. మహిళా భక్తులు వేకువ జమునే పుణ్య స్నానాలు ఆచరించి సూర్య భగవానునికి సూర్య నమస్కారం చేశారు. స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు బీచ్ వద్దకు వచ్చిన భక్తులకు పులిహోర, ఉప్మా, వాటర్, మజ్జిగ ప్యాకెట్స్ వంటివి పంపిణీ చేశారు. భక్తులు హంసలదీవి గ్రామంలోని శ్రీ రుక్మిణి సమేత వేణుగోపాలస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కవుతరం ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఈనెల 4వ తేదీన గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి ఆటలు పోటీలలో మండలంలోని కవుతరం కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చి విజేతలుగా ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ రజనీకుమారి బుధవారం తెలిపారు. వాలీబాల్ అండర్ 14 విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థి రోహిత్ కుమార్ గెలుపొందగా, కబాడీ అండర్ 14 విభాగంలో 8.తరగతి పి సంతోష్ కుమార్ లు జిల్లాస్థాయిలో ఎంపికయ్యారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు వివి రమణకుమారి, షేక్ ఇర్ఫాన్‌ను విద్యా కమిటీ చైర్మన్ పాము అభినందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జెడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఈ నెల నాలుగో తేదీన గుడివాడలో జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలలో జూనియర్ విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో అవనిగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని షేక్ సల్మాది ద్వితీయ స్థానం సాధించగా ఆమెను రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక చేసినట్లు పాఠశాల పిడి ఉదయ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 7,8 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగే రాష్ట్రస్థాయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైందన్నారు. విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మత్తి నాగమల్లేశ్వరరావు, పిడి ఉదయ్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

మృతుని కుటుంబసభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలంలోని పెదప్రోలు పంచాయతీలో గల శివరామపురం గ్రామానికి చెందిన పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ మేకా వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను ప్రముఖ పారిశ్రామికవేత్త, కూటమి నాయకులు విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు బుధవారం పరామర్శించారు. వెంకటేశ్వరరావు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు చిత్ర పటానికి స్థానిక నేతలతో కలిసి విక్కుర్తి శ్రీనివాస్ పూలమాలలతో నివాళులు అర్పించారు. వెంకటేశ్వరరావు మృతికి గల కారణాలను కుమారుడు మేకా దినేష్ ను



శ్రీనివాస్ అడిగి తెలుసుకున్నారు. పిఎసిఎస్ అధ్యక్షులు నాదెళ్ల శరత్ చంద్ర ప్రసాద్, తెలుగుదేశం పార్టీ తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రావి రత్నగిరి, తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు నాదేళ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పామర్రు : దేవాలయాలకు పూర్వ వైభవం తెచ్చేదిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండల పరిధి ఉండ్రపూడి- పోలవరం అడ్డ రోడ్డు వద్ద వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయ దేవస్థానం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామర్రు నియోజకవర్గం లోని దేవాలయాల అభివద్ధికి 6 కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ప్రభుత్వం ధర్మకర్తలుగా ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ గుడివాడ డివిజన్ తనిఖీ అధికారి వి.సుధాకర్, దేవాలయ కమిటీ చైర్మన్గా తాడిశెట్టి వెంకటేశ్వరరావు ధర్మకర్తలుగా 11 మంది చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఓ. పీవీఎస్వి ప్రసాద్ రావు, పామర్రు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్, జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు గొట్టిపాటి లక్ష్మీ దాసు, మార్కెట్ యార్డ్ చైర్మన్ శోభన్ బాబు, మాజీ చైర్మన్ మండపాక శంకర్ బాబు పాల్గొన్నారు.



దేవస్థానం నూతన కమిటీ ఎన్నిక

శ్రీ వీరాంజనేయ దేవస్థానం చైర్మన్ గా తాడిశెట్టి వెంకటేశ్వరావు, ధర్మకర్తల మండలి సభ్యులుగా చిల్లర వీర సాంబశివరావు, యార్లగడ్డ రమేష్ బాబు, ఈడే ఘంటేశ్వరరావు, దేవరపల్లి పద్మ, కల్లేపల్లి అంకమ్మ, వడ్లాది శివరామకష్ణ, అగ్నిహోత్రం రామాచార్యులు, నల్లారి నాంచారమ్మ, మట్ట నీరజ్, శీలం తిరుపతమ్మ లు ప్రమాణ స్వీకారం చేశారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-కోడూరు : ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కోడూరు మండల పరిధిలోని మాచవరం గ్రామంలో చోటుచేసుకుంది. కోడూరు ఎస్సై చాణిక్య తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన బలుసుపల్లి స్వరూపారాణి(39) మంగళవారం ఇంటి వద్ద ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుందన్నారు. ఎంతసేపటికి ఇంటిలో నుంచి మహిళ బయటికి రాకపోవడంతో గమనించిన కుటుంబీకులు ఇంటిలోకెళ్లి చూడగా ఉరివేసుకోవడంతో వెంటనే అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం తరలిస్తుండగా మార్గమధ్యంలో స్వరూపారాణి మృతిచెందింది. మతురాలి కుమారుడు నాగ ఫణీంద్ర కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. మతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బుధవారం వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

బస్సుఢీకొని వ్యక్తి మృతి




ప్రజాశక్తి-ఉయ్యూరు : సాయిమహల్ సెంటర్లో మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొని రాజస్థాన్కు చెందిన వ్యక్తి మృతి చెందాడు. ఉయ్యూరు పట్టణ పోలీసుల వివరాల ప్రకారం రాజస్థాన్‌కు చెందిన ప్రజాపత్ జిత్తు (35) స్థానిక రాజస్థాన్ టీస్టాల్లో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి సాయిమహల్ సెంటర్ వద్ద రోడ్డుదాటుతున్న క్రమంలో విజయవాడను ఒడి పామర్రువైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. గాయపడిన అతనిని ప్రభుత్వ వై ద్యశాలకు తరలించగా చికిత్సపొందుతూ మతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నకిలీ పోలీసు అరెస్టు

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ రూరల్ మండల ంలో మోటూరు గ్రామంలో నకిలీ పోలీసుగా చలామణి అవుతున్న గంటా హేమశేష శ్రీనివాసరావును అరెస్టు చేసినట్లు తాలూక పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎన్.చంటిబాబు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గతంలో గంగానమ్మ తల్లి దేవాలయానికి సంబంధించి కమిటీ అంతర్గత విభేదాలు ఉన్న నేపథ్యంలో గంగానమ్మ తల్లి జాతర సందర్భంగా ముద్దాయి గంట హేమ శేష శ్రీనివాసరావు పోలీసు అవతారమెత్తి సబ్ ఇన్స్పెక్టర్ యూనిఫామ్ ధరించి, దేవాలయ పూజారిని ఇతరులను బెదిరించినట్లు తెలిపారు. దేవాలయ తాళాలు, వాటర్ బోరు మోటార్‌ను బలవంతంగా లాక్కున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిన్నాపురం పిహెచ్‌సిలో తనిఖీ



ప్రజాశక్తి-మచిలీపట్నం రూర ల్ : మచిలీపట్నం మండ లంలోని చిన్నాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యుగంధర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది అందరూ ముఖ ఆధారిత హాజరును తప్పనిసరిగా వారికి కేటాయించిన హెడ్ క్వార్టర్ లో మాత్రమే వేయాలన్నారు. అలాగే అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టాలని, ఫీల్డ్ కి వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా మూవెమెంట్ రిజిస్టర్‌లో రాసి వెళ్లాలన్నారు. పీహెచ్సీలో అన్ని రకమ ులైన వైద్య పరీక్షలు మరియు మందులు అందుబాటులో ఉన్నాయా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్సీలో కాన్పులు అయ్యేటట్లు చూడాలని చెప్పారు. పీహెచ్సీలో జరుగుతున్న వైద్య సేవలు గూర్చి వైద్యాధికారి డాక్టర్ గాయత్రి వివరించారు.

పత్తి రైతు అతలాకుతలం

- రాలిపోతున్న పూత
- కుళ్లిపోతున్న కాయలు
- కార్మికుల కొరతతో ఇబ్బందులు
- తెరుచుకోని కొనుగోలు కేంద్రాలు



ప్రజాశక్తి-మైలవరం: పత్తి రైతులు తుపాన్లు, వరుస వర్షాలతో అతలాకుతలం అవుతున్నారు. పైరు ఎర్రబారి, పూత రాలిపోయి, కాయలు కుళ్లిపోయి, తీతకు వచ్చిన పత్తి మొలకలు వచ్చి, రంగుమారి ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిన రైతులను ఇప్పుడు కూలీల కొరత వేధిస్తోంది. మోంథా తుపాను నుంచి బయటపడి తీతకు వచ్చిన పత్తినైనా తీస్తే ఖర్చులకైనా వస్తాయనుకుంటే పత్తి తీసేందుకు కూలీలు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అడిగినంత కూలి ఇచ్చేందుకు సిద్ధపడినా కూలీలు దొరక్కపోవడంతో తీతకు వచ్చి పత్తి చెట్ల పైనుంచి కారిపోతుంది. వాతావరణంలో మార్పులు వస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఉపాధి హామీ చట్టానికి రెగ్యులర్ పంటలను సైతం అనుసంధానం చేస్తే భవిష్యత్తులోనైనా కూలీల కొరత తీరుతుందని రైతులు అంటున్నారు.

పత్తి తీసేందుకు కూలీలు రాకపోవడంతో చేతికొచ్చిన పంట నేల పాలవుతుందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తిని తీసేందుకు కూలీలకు తుపాను ముందు వరకు కిలో పత్తికి రూ.15 చొప్పున క్వింటాకు రూ.1500 వరకు రైతులు చెల్లించేవారు. తుపాను తర్వాత రైతులు అందరూ ఒకేసారి పత్తి తీసేందుకు సిద్ధమవడంతో కూలీల కొరత ఏర్పడింది. దీనితో డిమాండ్ పెరిగి ప్రస్తుతం కిలోకి రూ.20 చొప్పున చెల్లిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రోజు కూలి రూ.500 చెల్లిస్తుండగా ఒక్కొక్కరు రోజుకి పది కిలోల పత్తిని మాత్రమే తీస్తుండటంతో క్వింటాకి రూ.5 వేల వరకు ఖర్చు అవుతుంది. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో కూలీలు దొరక్కపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొస్తున్నారు. దీనితో కూలీల ఖర్చుతో పాటు రవాణా ఛార్జీలు సైతం రైతులే చెల్లించాల్సి రావడంతో రైతులపై అదనపు భారం పడింది.

ఎన్టీఆర్ జిల్లాలో 32,744 హెక్టార్లలో ఈ ఏడాది పత్తి సాగవుతుండగా ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వానలతో పైరు ఎర్రబారి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇక మోంథా తుపాను ప్రభావానికైతే ఏకంగా తీతకు వచ్చిన పత్తి చెట్లపైనే మొలకలు రావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. అయితే ఇప్పుడు చెట్లపై ఉన్న పత్తిని తీసేందుకు కూలీల కొరత ఏర్పడటంతో రెగ్యులర్ క్రాఫ్‌లను ఉపాధి హామీతో అనుసంధానం చేయాలనే డిమాండ్ పెరుగుతుంది. ఎన్టీఆర్ జిల్లాలో ఉపాధి హామీ చట్టంలో 2.08 లక్షల జాబ్‌కార్డులు ఉండగా 3.76 లక్షల మంది కూలీలు ఉన్నారు. ఇప్పటికే ఉపాధి హామీ చట్టంలో 14 ఉద్యాన పంటలను అనుసంధానం చేసి రాయితీలు ఇవ్వడంతోపాటు కూలీలను కూడా వినియోగిస్తుండటంతో పత్తి, వరి, మిరప వంటి పంటలకు కూడా వర్తించేలా చేయాలని రైతులు కోరుతున్నారు.

దోచుకుంటున్న దళారులు

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) కొనుగోలు కేంద్రాలను ఇంకా తెరవకపోవడంతో దళారులు అందిన కాడికి దోచుకుంటున్నారు. క్వింటా రూ.3 వేలకు కొంటున్నారని రైతులంటున్నారు. ఈ ధరకు అమ్మితే పెట్టుబడి కూడా రాదని తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలను ఇప్పటి వరకు ఏర్పాటు చేయకపోవడంతో వర్షాలకు తడిసిన పత్తి రంగు మారి దళారులు అందినకాడికి దోచుకుంటున్నారు. క్వింటా పత్తి తీయడానికి రూ.2 వేలకు పైగా ఖర్చు అవుతుంటే క్వింటా పత్తి ప్రయివేటు వ్యాపారులు రూ.3 వేలకు మించి కొనగోలు చేయడంలేదు. ఇప్పటికే కౌలు, పెట్టుబడి రూపంలో ఎకరానికి రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెబుతున్నారు. అంతే కాకుండా ఇటీవల వచ్చిన వరుస వానలతో పాటు మోంథా తుపాను ప్రభావంతో పత్తి పైరు ఎర్రబారి ఎండిపోతున్న క్రమంలో పంట నష్టం కూడా నమోదు చేయడంలేదని రైతులు వాపోతున్నారు.



తీవ్రంగా నష్టపోయాను

వేమిరెడ్డి రామసుబ్బారెడ్డి, రైతు, కొత్త మంగాపురం

ఈ ఏడాది ఐదు ఎకరాల్లో పత్తి వేశాను. పెట్టుబడి రూపంలో చాలా ఖర్చయింది. కురిసిన వానలకు పత్తి తడిసిపోయి కాయలు కుళ్లిపోతున్నాయి. దిగుబడి బాగా తగ్గటంతో పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి దాపురించింది. తీవ్రంగా నష్టపోయాను.

పత్తి నేలపాలు



వెన్నపూస శివపార్వతి, కౌలు రైతు, సజ్జపాడు

ఎకరం కౌలుకు తీసుకుని పత్తి వేసాము. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టాము. ఇటీవల వచ్చిన తుపానుకు పత్తి తడిసి నేల పాలవుతుంది. కూలీలు పత్తి తీయడానికి రావడం లేదు. ఒక్కొక్క కూలీకి రూ.500 పైగానే ఇవ్వాల్సి వస్తుంది. ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయాను.

దుర్గమ్మ సన్నిధిలో నారా రోహిత్


ప్రజాశక్తి-విజయవాడసిటీ: ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మను సినీ నటుడు నారా రోహిత్ దంపతులు బుధవారం దర్శించుకున్నారు.



వారికి దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ ఈవో శీనా నాయక్, పాలకమండలి సభ్యులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం అమ్మవారి శేష వస్త్రం, చిత్రపటం అందజేశారు. హైదరాబాద్ నగరానికి చెందిన ఓ ప్రైవేట్ ఫార్మా కంపెనీ యాజమాన్యం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి అంబులెన్స్‌ను విరాళంగా బహూకరించారు. ఇంద్రకీలాద్రికి వచ్చే యాత్రికులు అస్వస్థతకు గురైన సందర్భంలో అత్యవసర సేవలు అందించేందుకు కొండ దిగువ మల్లికార్జున మహా మండపం వద్ద అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచుకున్నట్లు దుర్గగుడి ఈవో శీనానాయక్ తెలిపారు.

ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని ధరణికోట గురునాథం లక్ష్మీనరసమ్మ భవనమందలి రిటైర్డ్ ఉద్యోగుల సంఘము ఆధ్వర్యంలో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరము నిర్వహించారు. జగ్గయ్యపేట రోహన్ దంత వైద్య నిపుణులచే ఈ వైద్య శిబిరం నిర్వహించారు. అనేకమంది సంఘ సభ్యులు, ప్రజలు ఈ అవకాశమును వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో ధరణి కోట వెంకటరమణ, దారా వినోద్ బాబు, మరియదాసు, ఫకీర్ అహ్మద్, కే పూర్ణ, బి సత్యనారాయణ, జంపాల వెంకటేశ్వరరావు, వినయవాణి, కమల కుమారి, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి గ్రామం నుండి గోపినేనిపాలెం వరకు నిర్మించిన బిటీ రోడ్డును కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యేశ్రీరాం రాజగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమలగిరి గ్రామం అభివృద్ధి దిశగా తీసుకుంటున్న ప్రతి అడుగు ప్రజల సౌకర్యార్థమేనని పేర్కొన్నారు. ఈ రహదారి ద్వారా గ్రామస్తులకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని, వ్యవసాయ ఉత్పత్తులను సులభంగా మార్కెట్‌కి తరలించుకోవచ్చని తెలిపారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని చిల్లకల్లు ఆటో కార్మికుల జనరల్ బాడీ సమావేశం యూనియన్ అధ్యక్షుడు బ్రహ్మం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ ఆటో కార్మికులు సర్వీసు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు డ్రైవర్లకు సాధికార సంస్థ ఏర్పాటు చేస్తామని మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిందన్నారు. కానీ 16 నెలలైనా ప్రభుత్వం ఏర్పాటు చేయలేదన్నారు. ప్రభుత్వం వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భారీ పెనాల్టీలు విధిస్తున్న జీవో నెంబర్ 21 రద్దు హామీ నెరవేర్చలేదని తెలిపారు. స్త్రీ శక్తి పథకం వల్ల ఆటో కార్మికుల ఆదాయం పడిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి షేక్ గౌస్‌మియా, యూనియన్ కార్యదర్శి అబ్రహం, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు శ్రావ్య ఎంపిక

ప్రజాశక్తి-గంపలగూడెం: స్థానిక శ్రీనిధి స్కూలుకు చెందిన బంకా శ్రావ్య 14 సంవత్సరాల్లోపు విభాగంలో జరిగిన కోకోలో పాల్గొని విజయం సాధించింది. ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థినిని పలువురు అభినందించారు.

ఫుడ్ కోర్టు ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: చెరువు బజార్ రోడ్డులో ఏర్పాటు చేయబోయే ఫుడ్ కోర్ట్ స్థలాన్ని స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఫుడ్ కోర్ట్ ఏర్పాటు వల్ల పట్టణంలోని చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారుల అభివృద్ధికి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ పి.మురళీకృష్ణప్రసాద్, కౌన్సిలర్లు పేరం సైదేశ్వర రావు, గింజుపల్లి కృష్ణ, మెప్మా టౌన్ ప్రెసిడెంట్ నసీమూన్ పాల్గొన్నారు.

సహకార బ్యాంకులతో మెరుగైన సమాజం

విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ అంజయ్య

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: మెరుగైన సమాజం రూపకల్పనలో సహకార బ్యాంకుల పాత్ర ఎనలేనిదని విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ డైరెక్టర్ ఎన్.అంజయ్య అన్నారు. బుధవారం విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ వన్‌టౌన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని కోరగంజి ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా సహకార సదస్సు నిర్వహించారు. అంజయ్య మాట్లాడుతూ సహకార బ్యాంకులు కేవలం ఆర్థిక కార్యకలాపాలకు మాత్రమే పరిమితం కాకుండా సభ్యులు, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తాయని చెప్పారు. సమాజాభివృద్ధిలో సహకార బ్యాంకులు కీలక పాత్ర వహిస్తున్నాయనిచెప్పారు. 1916 జనవరి 11వ తేదీన సహకార సంఘం గా రిజిస్టర్ అయిన విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ 2025 నాటికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 57 బ్రాంచీలతో 1,15,378 మంది సభ్యులతో సేవలందిస్తోందని చెప్పారు. బ్యాంక్ డైరెక్టర్ సి.కోటేశ్వరరావు



మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు సమిష్టిగా అందరి బాగోగుల కోసం పనిచేయడమే సహకార రంగం గొప్పతనం అని వివరించారు. సహకార బ్యాంకుల్లో షేర్లు ఉన్న ప్రతి సభ్యుడు బ్యాంకులో భాగస్వామి అని వివరించారు. విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు సమాజ శ్రేయస్సు కోసం, సభ్యులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఆయన వివరించారు.



పాఠశాలకు ప్రహరీ నిర్మించరూ..!

ప్రజాశక్తి-రెడ్డిగూడెం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ మరమ్మతులకు నిధులు మంజూరైనా పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో పాఠశాలకు రక్షణ లేకుండా పోయింది. 2024 ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు పాఠశాల ఆవరణలో పెద్ద ఎత్తున నీరు చేరి గోడ కూలిపోయింది. దీంతో స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాదు చొరవతో పది లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి. కానీ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ ప్రహరీ నిర్మాణానికి మంజూరైన నిధులు సమయానికి వినియోగించకపోతే ఆ నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల చైర్మన్, అధికారులు, స్పందించి తగు చర్యలు తీసుకుని ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.

పారదర్శకంగా పంట నష్టం లెక్కింపు : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లాలో పంట నష్టం లెక్కింపు కార్యక్రమం గత ఏడు రోజులుగా నిరంతరంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ డికె బాలాజీ ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 29న మోంథా తుఫాన్ తీరం దాటిన వెంటనే, పంట నష్టం ప్రాథమిక అంచనాలు ప్రారంభమయ్యాయని, ఆ తరువాత అన్ని ప్రభావిత మండలాల్లో పరిశీలన లెక్కింపు నిర్వహిస్తోన్నామన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు, గ్రామ రెవిన్యూ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు, మండల వ్యవసాయ అధికారులు సహా అన్ని స్థాయి సిబ్బంది నిరంతరంగా క్షేత్ర స్థాయిలో లెక్కింపు కార్యక్రమాన్ని చిత్తశుద్ధి తో నిర్వర్తిస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం లెక్కింపు ప్రక్రియ నిర్వహిస్తున్నామని, అన్ని వివరాలు APAIMS మొబైల్ యాప్ ద్వారా డిజిటల్ రూపంలో నమోదు అవుతున్నాయన్నారు. ఈ యాప్ ఈ-క్రాప్ నమోదు వ్యవస్థతో అనుసంధానించినందునా ఖచ్చితమైన, పారదర్శకమైన డేటా సేకరణ జరుగుతోందన్నారు. రైతులు ఎటువంటి అదనపు పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని, పొరపాటున ఈ క్రాప్ లో నమోదు కానటువంటి పొలాలను కూడా లెక్కింపు చేస్తున్నట్లు తెలిపారు. పంట నష్టం లెక్కింపు ప్రక్రియ ధాన్యం కొనుగోలుతో సంబంధంలేదని, రైతుల నుండి ధాన్యం కొనుగోలు ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు.



రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పమిడిముక్కల : చోరగుడి గ్రామ అభివద్ధికి కట్టుబడి ఉన్నామని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. బుధవారం పమిడిముక్కల మండలంలోని చౌరగుడి గ్రామంలో రెండు కోట్ల ఐదు లక్షలతో నాబార్డ్ నిధులతో చోరగుడి నుండి గోపాలకృష్ణ పురం వరకు 3.45 కిలోమీటర్ల దూరం వరకు బీటీ రోడ్డు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. చౌరగుడి గ్రామపంచాయతీ ఉత్తమ పంచాయతీగా ఎన్నికై అవార్డు అందుకోవడంపట్ల గ్రామ సర్పంచ్ కందిమల్ల పూర్ణ కుమారిని అభినందించారు. గ్రామ సర్పంచ్ కందిమల్ల పూర్ణ కుమారి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, జక్క శ్రీనివాసరావు, లింగమనేని బాబురావు, కందిమల్ల సుబ్రహ్మణ్యం, ఎంపిడిఒ సీతారామరాజు, కరెంటు ఏఈ శ్రీనివాస్, తోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

తుపాను బాధితులకు సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండలంలోని మేకావానిపాలెంలో ఇటీవల సంభవించిన మొంథా తుఫాను కారణంగా, చెట్లు విరిగి, ఇంటి పైకప్పుమీదపడి దెబ్బతిన్న నిరుపేద కుటుంబానికి బుధవారం ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్, మచిలీపట్నం డివిజన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు మరియు గహోపయోగ వస్తువులు, బియ్యం, దుప్పట్లు, బట్టలు, టవల్స్, కొంత నగదు అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి మచిలీపట్నం డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి.సుధాకర్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ ముందుకు వచ్చి, ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం బహుదా అభినందనీయమని పేర్కొ న్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్ కుమార్ కార్యక్రమంని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఇన్సూరెన్స్ కొర్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ యూనియన్ నాయకులు,డి వాసు, ఎ శ్రీనివాస రావు, ఎ మల్లి కార్జున ప్రసాద్ గ్రామ పెద్దలు వాలిశెట్టి తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్ఐసి మచిలీపట్నం డివిజన్ నాయకులు

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-కోడూరు : అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు చేయూత అందించారు. మంగళవారం రాత్రి కోడూరు మండల పరిధిలోని పిట్టలంక గ్రామానికి చెందిన కైలా శరత్ బాబు పూరిల్లు విద్యుత్ షాక్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా దగ్నమైంది. బుధవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కోడూరు మండల శాఖ వారు, వంట సామాగ్రి కిట్టు, తార్పల్ పట్టా, మండలం రెడ్ క్రాస్ ఛైర్మన్ వేజెండ్ల శ్రీనివాసరావు సౌజన్యంతో 25 కేజీల బీపీటీ బియ్యం, కూరగాయలు అందించారు. ఈ కార్యక్రమంలో పిట్టలంక గ్రామ సర్పంచ్ కనగాల వెంకటేశ్వరావు, బడేవారిపాలెం పిఏసిఎస్ ఛైర్మన్ మర్రే గంగయ్య, మండల రెడ్ క్రాస్ వైస్ ఛైర్మన్ తోట శ్రీనివాసరావు, సభ్యులు కొండవీటి సురేష్, జొన్నా రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో జడ్జి

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని అవనిగడ్డ సిక్స్త్ అడిషనల్ డిస్టిక్ జడ్జి పాండురంగా రెడ్డి దర్శించు కున్నారు. ఆయననుఆలయ మర్యాదలతో ఆలయ డిప్యూటీ కమిషనర్ ఆలయ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు సత్కరించి, ప్రసాదాలను అందజేసి, స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గూడూరు : పెడన నియోజవర్గం గూడూరు మండలం గూడూరు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని, రైతులు శ్రమించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసి ఛైర్మన్ పోతన స్వామి,మండల తహసీల్దార్ డి. రాజ్యలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి గుమ్మడి శివ రామకష్ణ, జనసేనకోలపల్లి రజిని,కొరియర్ శ్రీను, ఎన్ ఏ బేగ్, పోతన రామోజీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి- ఉయ్యూరు : రైతులనుండి ధాన్యం కొనుగోలుచేసి సకాలంలో వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బువేసేందు కు ప్రభుత్వం సిద్ధంగా ఉందని టీడీపీ మడంల అధ్యక్షుడు యెనిగళ్ల వెంకట కుటుంబరావు అన్నారు. చినఓగిరాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ ఛైర్మన్ పాలడుగు రామకృష్ణ, డైరెక్టర్లతో కలసి బుదవారం ప్రారంభించారు. కఠారి దుర్గారావు, పాలడుగు వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గూడూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాగిత

ఢిల్లీ సైన్స్ యాత్రకు నాగాయలంక విద్యార్థుల ఎంపిక



ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలోని నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులు చాపల మోక్షజ్ఞ, సనకా తేజ సాయిలు ఢిల్లీ సైన్స్ యాత్రకు ఎంపికైనట్లు జిల్లా విద్యా శాఖాధికారి పి వి జె.రామారావు, జిల్లా సైన్స్ అధికారి మొహమ్మద్ జాకీర్ అహ్మద్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో సజనాత్మకత, ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఏపీ సైన్స్ సిటీ సంయుక్త ఆధ్వర్యంలో సైన్స్ ఎక్స్పోజర్ ఎడ్యుకేషనల్ టూర్‌ను నిర్వహిస్తోందని డిఈఓ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ఇద్దరు చొప్పున మొత్తం 52 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. ఎంపికైన విద్యార్థులు నవంబర్ 5న బుధవారం గన్నవరం విమానాశ్రయం నుంచి విమానంలో న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లారని, అక్కడి ఏపీ భవన్‌లో బసచేయనున్నారన్నారు. నవంబర్ 6 నుండి 8 వరకు వారు ఢిల్లీలోని రష్యన్ సెంటర్ ఆఫ్ సైన్స్ అండ్ కల్చర్, నేషనల్ సైన్స్ మ్యూజియం, నెహ్రూ ప్లానిటోరియం, ఇండియా గేట్ మరియు భారత పార్లమెంట్ వంటి ప్రఖ్యాత సైన్స్, చారిత్రక కేంద్రాలను సందర్శిస్తారన్నారు. అంతేకాక, విద్యార్థులు నాసా, ఇస్రోకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలతో చర్చాగోష్టిలో పాల్గొననున్నారని జిల్లా సైన్స్ అధికారి జాకీర్ అహ్మద్ తెలిపారు.



కరాటే పోటీల్లో కెకెఆర్ గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గుడివాడ : ఇటీవల విజయవాడలోని జె.కె గోజూరియా కరాటే అకాడమి నిర్వహించిన 24వ ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో గుడివాడకు చెందిన డా॥కెకెఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు మెడల్ సాధించినట్లు ప్రిన్సిపల్ పి.లక్ష్మీప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలలో ఎ.ప్రవీణ్, కె.బి వితేష్, డి.అభిరామ్, వై.గిరిష్‌లు తృతీయ స్థానం సాధించి బ్రాంజ్ మెడల్ సాధించడం గొప్ప విషయన్నారు. ఈ పోటీలలో విద్యార్థులకు మంచి శిక్షణ ఇచ్చిన కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు, విద్యార్థులను వివిధ సెక్షన్‌ల ప్రిన్సిపల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతిలు అభినందించారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -నందివాడ : మండలంలోని వెన్ననపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి కబడ్డీ సెలక్షన్స్ బుధవారం నిర్వహించారు. కృష్ణా జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కేవీ నాంచారయ్య కార్యదర్శి పి రవీంద్రబాబు ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్‌వై మాధవ కుమార్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 7, 8, 9 తారీకులలో కర్నూలు జిల్లాలో జరిగే 32వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సెలక్షన్స్ బాలుర విభాగంలో 14 మంది, బాలికల విభాగంలో 14 మందిని ఎంపిక చేశారు.



సురేంద్రనాథ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : స్థానిక పారిశ్రామికవేత్త చలమలశెట్టి సునీల్ తండ్రి, ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ చలమలశెట్టి సురేంద్రనాథ్ మంగళవారం రాత్రి హైదరాబా ద్‌లోని స్వగృహంలో మృతిచెందారు. ఆయన అంత్యక్రియలు స్వస్థలం మచిలీపట్నంలో బుధవారం మధ్యాహ్నం నిర్వహించారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలసౌరి చలమలశెట్టి సునీల్ స్వగహంలో సురేంద్రనాథ్ పార్థివదేహం సందర్శించి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. పారిశ్రామికవేత్త చలమలశెట్టి సురేంద్రనాథ్ కన్నుమూత మచిలీపట్నం అభివద్ధికి తీరని లోటని వ్యాఖ్యానించారు. గ్రీన్ ఎనరిచ్ ఎకో సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి డైరెక్టర్ గా, గ్రీన్ కో ఎనర్జీ ఎఫిషిఎన్సి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి అడిషనల్ డైరెక్టర్గా, ఎక్స్రస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ గా, డిజీ టెలి నెట్వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి డైరెక్టర్గా, ఈవన్ సివన్ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి డైరెక్టర్గా, యూరో ఆంధ్ర ఎంటర్టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి డైరెక్టర్ గా అనేక కంపెనీలు స్థాపించిన సురేంద్రనాథ్ ప్రజారాజ్యం పార్టీ నుండి ఒకసారి ఎంపీగా పోటీ చేశారు. వైసీపీ పార్టీ నుండి ఒకసారి ఎంపీగా పోటీ చేశారు. సురేంద్రనాథ్ అంతిమయాత్ర లో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి పేర్ని నాని, గన్నవరం మాజీ శాసనసభ్యుడు వల్లభనేని వంశీ, టిడిపి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, గోల్డ్ ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు, తదితర ప్రముఖ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



అంతిమయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



పృథ్వీశ్వర దేవస్థానానికి కంచుగంట బహూకరణ

ప్రజాశక్తి చల్లపల్లి : చల్లపల్లి మండలం నడకుదురులోని ప్రముఖ ప్రాచీన శైవక్షేత్రం శ్రీ పథ్వీశ్వర స్వామి దేవస్థానానికి చెన్నయ్‌కు చెందిన భక్తులు యార్లగడ్డ విజయకుమారి శివరామ ప్రసాద్ దంపతులు 75 వేల రూపాయలు విలువచేసే భారీ కంచుగంట, ఇత్తడి నిలువెత్తు దీపపు కుందులను బహుకరించారు. కార్తీక పౌర్ణమి కావటంతో బుధవారం ఆలయంలో అందజేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు మామిళ్ళపల్లి పథ్వీ కళ్యాణ్ పూజలు చేసి ఆలయంలో అలంకరించారు. ఆలయ సమగ్ర అభివద్ధి దాత మండల రవీంద్ర రమణకుమారి దంపతులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● డిసిఎల్‌కు నాయకులు వినతి

ప్రజాశక్తి-విజయవాడ

నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు కోరారు. ఈ మేరకు ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా నాయకత్వం డీసీఎల్ ధనలక్ష్మిని కలిసి కార్మికుల సమస్యలపై బుధవారం వినపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో భవన నిర్మాణంలో పనిచేస్తున్న కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం, అధికారులు పూర్తిగా వైఫల్యం చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పనిచేయించి పథకాలను కొనసాగించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల మెడమీద కత్తిలా వేలాడుతున్న మెమో 1214 సర్కులర్ ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. కార్మికుల ఆందోళన సందర్భంగా లేబర్ కమిషనర్ కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సందర్భాల్లో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని వినతి పత్రాలు ఇచ్చి, ఆందోళనలు చేసినా అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లుగా, దున్నపోతు మీద వర్షం కురిసిన చందనంగా ఎటువంటి చలనం లేకుండా ఉంటున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్న నేటికీ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరిస్తామన్న ఇచ్చిన హామీ ఏమైందోనని ప్రశ్నించారు. దీనిపై సిఎం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిల్లి నరసింహారావు, పి. అప్పారావు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న స్థానిక ధర్నా చౌక వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. తక్షణమే కూటమి ప్రభుత్వం, లేబర్ అధికారులు స్పందించి సంక్షేమ బోర్డు ను పునరుద్ధరించి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ సిటీ కార్యదర్శి యం.బాబూరావు, పశ్చిమ సిటీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి,కార్యదర్శి సుబ్బారెడ్డి, తూర్పు సిటీ కార్యదర్శి బి.వి రాజు, తదితరులు పాల్గొన్నారు.


అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు



విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మచిలీపట్నం ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో పెనమలూరు శాఖలో డ్వాక్రా మహిళలకు విజిలెన్స్ పై అవగాహనా సదస్సు బుధవారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ విజిలెన్స్ అధికారి కె.వెంకట రాజు ఆధ్వర్యంలో నైతిక విలువలు అంటే ఏమిటి, వాటిని ఎలా పెంపొందించుకో వాలి అనే దానిపై మహిళలకు అవగాహన కల్పించారు. అవినీతి రహిత సమాజం కొరకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు బ్యాంకు శాఖ మేనేజర్ పి.వి.నంద కిషోర్ ఆధ్వర్యంలో బ్యాంకు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : వైద్య కళాశాలలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం రెడ్డిగూడెం మండల కేంద్రంలో కొనసాగింది. ఆ పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అధ్యర్యంలో మండల పార్టీ అధ్యక్షులు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల

ప్రజాశక్తి-నందిగామ: జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య నిధుల నుంచి నందిగామ మండలం ఐతవరం గ్రామంలోని ఎత్తిపోతల పథకానికి వెళ్ళే ప్రధాన రహదారి సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ 44 లక్షల రూపాయల నిధులను కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ లక్ష్మీ శా కు ఉత్తర్వులు అందజేశారు. రాజ్యసభ సభ్యులు ఆర్ కష్ణయ్య ఉత్తర్వులను రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం మహిళా నాయకురాలు నూకనమ్మ బుధవారం ఐతవరం గ్రామంలో మాజీ హోంశాఖ మంత్రి వసంత నాగేశ్వరరావు కు అందజేశారు. తన విజ్ఞప్తి మేరకు స్పందించి ఐతవరం ఎత్తిపోతల పథకం రహదారి నిర్మాణం కోసం రూ 44 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసిన ఆర్ కష్ణయ్య కు వసంత నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వీరంకి వీరస్వామి, సొసైటీ అధ్యక్షులు మద్దుకూరి రామారావు, మద్దాలి అనిల్ పాల్గొన్నారు.

వసతి గృహాల విద్యార్థులకు నీట్ కోచింగ్

ప్రజాశక్తి-విజయవాడ: ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్, ఏపీ టీడబ్ల్యూఆర్, ఎస్‌డబ్ల్యూ, టీబ్ల్యూ గురుకులాలు, వసతిగృహాల్లో ఇంటర్మీడియెట్ చదివి, నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని, అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా డీసీవో ఎ.మురళీకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో ఉచిత వసతి, భోజన సదుపాయాలతో శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయని.. సబ్జెక్టు నిపుణులతో శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. శిక్షణ కావాలనుకునే విద్యార్థులు ఆయా గురుకులాల ప్రిన్సిపాళ్ల, జిల్లా డీసీవోలు, విజయవాడలోని అంబేద్కర్ స్టడీ సర్కిల్ (75692 26400)లో లేదా ఎన్‌టీఆర్ జిల్లా డీసీవో (89782 22576)ను సంప్రదించవచ్చని డీసీవో మురళీకృష్ణ సూచించారు.

భావితరాలకు కలిసొచ్చేలా అభివృద్ధి : వర్ల

ప్రజాశక్తి-పామర్రు: ఏ రంగంలోనైనా భావితరాలకు కలిసొచ్చే విధంగా అభివృద్ధి పనులు చేయడమే నిజమైన అభివద్ది అని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సాగునీటి సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బల్లిపర్రు లాకుల వద్ద మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మొక్కలు నాటారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ జన్ను శోభన్ బాబు, డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, జిల్లా టిడిపి సహాయ కార్యదర్శి చాట్ల పెద్ద రమేష్, ఇరిగేషన్ శాఖ డిఈ,ఏఈ లు పాల్గొన్నారు.

క్వారీ ఇళ్లల్లో నీటిని తొలగించాలి : సిపిఎం




ఇళ్ల మధ్య నిలిచిన నీరు

ప్రజాశక్తి-నందిగామ: మొంథా తుపాను వల్ల కురిసిన వర్షాలకు నందిగామ 18వ వార్డు క్వారీలో పేదలు నివసిస్తున్న ఇళ్లల్లో నీటిని వెంటనే తొలగించాలని సిపిఎం నందిగామ కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం ఉమాకాలనీ ఫేజ్ 3,18వ వార్డులో క్వారీ గుంతల వద్ద నివాసముంటున్న ప్రజలను సిపిఎం నాయకులు పరామర్శించారు. పేరుకుపోయిన మురుగు నీటిని తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ మురుగు నీరు బయట పోయే పరిస్థితి లేదన్నారు. ఇళ్లల్లో నివాసం ఉంటున్న ప్రజలు, చిన్నపిల్లలు సుమారు 30 మంది దాకా ఉన్నారని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల పాములు, సంచరిస్తున్నాయని, చిన్న పిల్లలు సైతం మురుగు నీటిలోనే నడుస్తున్నారని, అనుకోకుండా క్వారీ గుంతల్లో పడిపోతున్నారని, రాత్రి సమయంలో దోమలు విజృంభిస్తున్నాయని, దుర్గంధం వెదజల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు నీటిని తోడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గోపినాయక్, బత్తుల వెంకటేశ్వర్లు పలువురు పాల్గొన్నారు.

14న సుగంధ ద్రవ్యాల జాతీయ సదస్సు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ

ఆలిండియా స్పైసెస్ ఎక్స్పోర్టర్స్ ఫోరమ్ (ఏఐఎస్ఈఎఫ్)కు సాంకేతిక భాగస్వామిగా లాభాపేక్ష లేకుండా పనిచేస్తున్న వరల్డ్ స్పైస్ ఆర్గనైజేషన్ (డబ్ల్యు ఎస్ఓ), ఆధ్వర్యంలో 4వ జాతీయ సుగంధ ద్రవ్యాల సదస్సు (ఎన్ఎస్సి) 2025ను నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి ఎం.సుభాష్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదస్సు ఈ నెల 14వ తేదీన గుంటూరు ఐటిసి వెల్కమ్ హోటల్లో జరగనుందని తెలిపారు. ది స్పైస్ రూట్ అహెడ్: సేఫ్, సస్టైనబుల్ అండ్ స్కేలబుల్ (సురక్షితమైన, సుస్థిరమైన, విస్తరణకు వీలైన భవిష్యత్తు దిశగా సుగంధ ద్రవ్యాల మార్గం) అనే ముఖ్య అంశంతో సదస్సు జరగనుందని తెలిపారు. సుగంధ ద్రవ్యాల రంగంలో వస్తున్న మార్పులపై చర్చించేందుకు ప్రభుత్వం, పరిశ్రమ, విద్యా రంగాలకు చెందిన ప్రముఖులు ఈ సదస్సులో పాలుపంచుకోనున్నారని తెలిపారు.

గురునానక్ జయంతి

ప్రజాశక్తి-నందిగామ: నందిగామలో గురునానక్ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. గురునానక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నందిగామ మండల టిడిపి అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి మాట్లాడుతూ లౌకికతత్వాన్ని బోధించిన మహనీయుడు గురునానక్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడివిరావులపాడు సొసైటీ అధ్యక్షుడు గరిమిడి సురేష్, ఎస్‌కే నాగులమీరా, పెర్నా నాగకృష్ణ, దుగ్గిదేవి గోపి పాల్గొన్నారు.

ట్రేడ్ కారిడార్ విస్తరణకు ప్రణాళిక

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: స్వదేశీ ఇ కామర్స్ మార్కెట్ ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్ దేశపు డిజిటల్ వాణిజ్య దృశ్యంలో శక్తివంతమైన పరివర్తనను చూస్తోందని ఫ్లిప్‌కార్ట్ మార్కెట్ ప్లేస్ హెడ్ సకైత్ చౌదరి అన్నారు. నగరంలో ఫ్లిప్ కార్ట్ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. సూరత్ మరియు భివాండి నుండి జైపూర్ మరియు కర్నాల్ వరకు కొత్త ప్రాంతీయ వాణిజ్య కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ అధిక వృద్ధి క్లస్టర్ల నుండి కొత్త ఎంపిక ప్రవాహంలో 1.4 రెట్లు పెరుగుదల ఉందన్నారు. టైర్-2, టైర్-3 నగరాల నుండి వ్యవస్థాపకులు స్థిరమైన, సాంకేతికత ఆధారిత వ్యాపారాలను వ్యాప్తి చేయడానికి కృషి చేస్తుందన్నారు. పండుగ షాపింగ్ మధ్య, ఆటోమొబైల్, టీవీలు, స్పోర్ట్స్ షూలు, మేకప్, సువాసనలతో సహా కొన్ని విభాగాలలో కూడా పెరుగుదలను ఫ్లిప్‌కార్ట్ నమోదు చేసిందని చెప్పారు. ఈ కొత్త వాణిజ్య కేంద్రాలు, అభివృద్ధి చెందుతున్న కొనుగోలు ప్రవర్తనలు కలిసి ఫ్లిప్‌కార్ట్ వృద్ధికి తోడ్పాటు అందిస్తున్నాయని, స్థానిక విక్రేతలు జాతీయ డిమాండ్‌తో ఎలా కనెక్ట్ అవుతారో తిరిగి రూపొందిస్తున్నాయని తెలిపారు.

ఆలయాలు కిటకిట

ప్రజాశక్తి-కంచికచర్ల: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని పలు శివాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక పాత శివాలయం, శివసాయిక్షేత్రం, పరిటాల, గొట్టుముక్కల, కీసర, ఆత్కూరు, మున్నలూరు, కునికినపాడు, మోగులూరు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో తెల్లవారుజామున మహిళలు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రి శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి, ముక్త్యాల శ్రీ కోటిలింగాల హరిహర మహా క్షేత్రం, తిరుమలగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జగ్గయ్యపేట సిఐ వెంకటేశ్వర్లు సలహాలతో చిల్లకల్లు ఎస్సై సూర్య శ్రీనివాస్ పోలీస్ సిబ్బంది సేవలందించారు. విజయవాడ సిటీ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం తో పాటు పాతబస్తీలోని ప్రధాన శివాలయాలలో కార్తీక పౌర్ణమి దీపోత్సవ వేడుకలు కనుల పండుగగా జరిగాయి. బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ సన్నిధిలో కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని ఆలయ అధికారులు వైభవంగా నిర్వహించారు. మల్లికార్జున స్వామి వారి దేవాలయం, పాతబస్తీలోని శ్రీ భ్రమరాంబా సమేత మల్లేశ్వర స్వామి వారి దేవాలయం శ్రీ విజయేశ్వర స్వామి వారి దేవాలయం, బ్రాహ్మణ వీధి బుద్ధ వారి దేవాలయాలలో జ్వాలా తోరణం మహోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహించారు.


దుర్గా ఘాట్‌లో...


కంచికచర్లలో...

మేక్ మై ట్రిప్ విస్తరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

మేక్‌మైట్రిప్ తమ సేవల పరిధిని విస్తరిస్తున్నట్లు సంస్థ సిఈవో రాజేష్ మాగోవి తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆరు రోజుల ప్రాథమిక ధోరణులు ముందస్తు విమాన ప్రణాళిక, విస్తత గమ్యస్థాన వినూత్నత, ప్రీమియం బస్సులకు నిరంతర ప్రాధాన్యతను తమ సంస్థ అందిస్తుందన్నారు. దేశీయంగా ప్రయాణికులు ఆరు రోజుల వ్యవధిలో భారతదేశం అంతటా విమానాలను బుక్ చేసుకున్నారని తెలిపారు. ఆసక్తికరంగా, అంతర్జాతీయ విమాన బుకింగ్‌లు 115 దేశాలలో 362 విమానాశ్రయాలకు విస్తరించాయని అన్నారు. సకాలంలో ఆఫర్లు, పరిమిత ఇన్వెంటరీ డీల్స్ కూడా అందిస్తున్నట్లు తెలిపారు.

నియామక ఉత్తర్వులు అందజేత

ప్రజాశక్తి -కలక్టరేట్ (కృష్ణా) : పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతిఒక్కరికి గుర్తింపు ఉంటుందని ఇందుకు నిదర్శనమే పి.వి. ఫణి కుమార్‌కు రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌లో రాష్ట్ర డైరెక్టర్ పదవి దక్కడం అని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ సందర్భంగా నియామక ఉత్తర్వుల ను బుధవారం మచిలీపట్నం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో మంత్రి కొల్లు రవీంద్ర ఫణికుమార్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో కొనకళ్ళ జగన్నాధ రావు ,మార్కెట్ యార్డ్ చైర్మన్, కుంచే నాని, మాజీ మున్సిపల్ చైర్మన్, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, జనసేన నాయకుడు, గడ్డం రాజు ,టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లోగిశెట్టి వెంకటస్వామి,ఉన్నారు.



దుస్తులు అందిస్తున్న దృశ్యం

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి- ఉంగుటూరు (బాపులపాడు) : బాపులపాడు మండల తహసీల్దార్ మురళీకష్ణ, వీఆర్వో సునీల్ కుమార్‌లు తమ సొంత నిధులతో వీరవల్లి ఆర్‌వి హెచ్ కాలనీ, ఏలూరు కాల్వ గట్టుపై డేరాలు వేసుకుని నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు నూతన వస్త్రాలు బహూకరించారు. గ్రామ సర్పంచ్ పిల్లా అనిత రామా రావు, గ్రామ పెద్దలు గుండపనేని ఉమావరప్రసాద్, కలపాల రాజబాబు, కలపాలం బాబు, అమతపల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎఎన్‌ఆర్ కళాశాల వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - గుడివాడ : డిసెంబర్ 16,17,18 తేదీల్లో గుడివాడ ఏఎన్నార్ కళాశాలలో జరగనున్న వజ్రోత్సవ వేడుకలను విజయ వంతం చేయాలని ఏఎన్‌ఆర్ కళాశాల కమిటి కార్యదర్శి కెఎస్ అప్పారావు కోరారు. బుధవారం స్థానిక ఏఎన్‌ఆర్ కళాశాలలో కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 16,17,18 తేదీల్లో గుడివాడ పట్టణంలోని ఏఎన్‌ఆర్ కళాశాల వజ్రోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో పూర్వ విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రి లోకేష్, ఈనాడు కిరణ్, అక్కినేని నాగార్జున తదితర ప్రముఖులు వేడుకల్లో అతిథులుగా హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో డైమండ్ జూబ్లీ వేడుకల కమిటీ చైర్మన్ కొల్లి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ కష్ణ ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ సూరపనేని శ్రీనివాస్‌రావు, కలశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌గా మమ్‌దాని గెలుపుపై హర్షం



ప్రజాశక్తి - గుడివాడ : సోషలిస్ట్ అభ్యర్థి మమ్‌దాని న్యూయార్క్ నగరానికి మేయర్‌గా ఎన్నికవ్వడం పట్ల సిపిఎం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయం నుండి ర్యాలీగా నెహ్రూ చౌక్ చేరుకున్న సిపిఎం నాయకులు సోషలిస్ట్ అభ్యర్థి మమ్దానీ గెలుపునపై సంబరాలు చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు మాట్లాడుతూ అమెరికాలో న్యూయార్క్ నగరానికి జరిగిన ఎన్నికల్లో డెమోక్రటిక్ అభ్యర్థిపై సోషలిస్ట్‌గా ఉన్న మమ్దానీ గెలుపు హర్షణీయమన్నారు. అమెరికాలో ట్రంప్ నాయకత్వంలో అమలవుతున్న పెత్తందారీ విధానాలు, ప్రజా వ్యతిరేక పెట్టుబడిదారీ విధానాలుకు ప్రతిఘటనగా మమ్దానీ గెలిచారన్నారు. ట్రంప్ మమ్దానీని గెలవనివ్వకుండా అనేక ప్రయత్నాలు చేసినా అమెరికా ప్రజలు సోషలిస్టు అభ్యర్థిని గెలిపించడం అమెరికా ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. అమెరికా ప్రజలు మార్పు కోరుకోవడానికి నిదర్శనం అన్నారు. ట్రంప్ తన పార్టీ అభ్యర్థి కన్నా ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపు కోసం తీవ్రంగా కృషి చేసినా మమ్దానీ గెలుపుని అడ్డుకోలేకపోయారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుల మాదాల వెంకటేశ్వరరావు, ఆర్‌సిపి రెడ్డి, పార్టీ నాయకులు సురేంద్ర, కొండ, బండి శ్రీను, యెస్సయ్యా, ఏ వెంకటేశ్వరరావు, సురేంద్ర, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సమరం, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి హామీపట్ల హర్షం

ప్రజాశక్తి-అవనిగడ్డ : డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ అవనిగడ్డ నియోజకవర్గం సమస్యలపై బుధవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించడం పట్ల అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. బుధవారం సాయంత్రం అవనిగడ్డలోని తమ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మంగళగిరి క్యాంప్ కార్యాల యంలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టం అంచనాలు, నియోజకవర్గ అభివద్ధి తదితర అంశాలపై డిప్యూటీ సీఎం సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని నాగాయ లంక, కోడూరు మండలాల్లో 5000 ఎకరాల్లో పంట ముంపు సమస్య పరిష్కారం కోసం కీలకమైన అవుట్ ఫాల్ స్లూయిజుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కళ్యాణ్ ఉన్నతాధికారులను ఆదేశించినట్లు బుద్ధప్రసాద్ తెలిపారు. ఎదురు మొండి బ్రిడ్జి నిర్మాణానికి నాబార్డ్ నిధులు రూ 109 కోట్లు ఇప్పటికే మంజూరు కాగా, అలైన్మెంట్లో మార్పుల కారణంగా మరో రూ.60 కోట్లు అవసరమవుతాయని తాను వివరించగా, ఆ నిధులు సాస్కి స్పెషల్ అసిస్టెంట్ టు స్టేట్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్మెంట్ నిధులు రూ రెండు వేల కోట్ల నుంచి కేటాయిస్తామని పవన్ కళ్యాణ్ చెప్పారని బుద్ధ ప్రసాద్ తెలిపారు. నిర్ణీత కాలవ్యవధిలో ఏటి మొగ-ఎదురు మొండి హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం ప్రకటించినట్లు తెలిపారు.



విజేతలకు బహుతులు అందిస్తున్న దృశ్యం

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రభుత్వం ఈ నెల నాలుగో తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న వన్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా వేకనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బయోడైవర్సిటీ ఇన్ ఫుడ్ సేఫ్టీ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కే విజయలక్ష్మి ,ఆరోగ్య పర్యవేక్షకులు కమ్మిలి తారక రామారావు, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ ,ఎం ఎల్ హెచ్ పి ప్రియాంక ఈ కార్యక్రమాన్ని నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఇంగ్లీషులో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో బి లాస్య ప్రియ ప్రథమ బహుమతి, పి కావ్యరత్న పావని ద్వితీయ బహుమతి, పి రహీన తతీయ బహుమతి గెల్చుకున్నారు. తెలుగులో జరిగిన వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి సిహెచ్ యామిని, ఏ బాల యేసు ద్వితీయ బహుమతి, కే హర్షిత తతీయ బహుమతి గెల్చుకున్నారు. విజేతలకు ఆరోగ్య పరిరక్షకులు తారక రామారావు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ ఆదిలక్ష్మి కూడా పాల్గొన్నారు.

విద్యార్థినికి సైకిల్ అందజేత

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం గోగినేనిపాలెం జడ్పీ హైస్కూల్లో 7వ తరగతి చదువుతున్న కుంపటి అక్షయకు గ్రీన్ గోగినేనిపాలెం కన్వీనర్, దాత కుంపటి ప్రవీణ్, ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు దేవరపల్లి సురేష్తో కలసి బుధవారం సైకిలను బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో మేడేపల్లి సుబ్బారావు, కుందేటి యోనాతాను, కె.వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

సాయం అందజేత

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : పెడన నియోజకవర్గం కత్తివెన్ను గ్రామంలో మొంథా తుఫాన్ ప్రభావం వల్ల కొయ్య సుబ్బారావు మరణించగా వారి కుటుంబానికి ప్రభుత్వం 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ఈ సాయాన్ని మృతుని కుటుంబసభ్యులకు పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గోర్జి పుట్టినరోజు వేడుకలు



ప్రజాశక్తి - గుడివాడ : డా॥గోర్జి సత్య నారాయణ జన్మదిన వేడుకలను బుధవారం గ్రామీణ వైద్య సంఘ నాయ కులు ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులోని గోర్జి సత్యనారాయణ స్వగహంలో ఆయన సతీమణి డాక్టర్ గోర్జి స్వర్ణకుమారి సమక్షంలో జన్మదిన వేడుకలను గ్రామీణ వైద్య సంఘ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా సాగిరాజు భాస్కరరాజు, నండూరి ఉమాశంకర్‌లు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు అందుబాటులో వైద్యం అందించే డాక్టర్ గోర్జి అభినందనీయుడని అన్నారు. ఆయన తండ్రి గుడివాడ మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ గోర్జి సింహాచలం పేరును ప్రజలకు గుర్తుండేలా పేదలకు తక్కువ ఖర్చుతో వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పోలా సింహాచలం, గుదే నాగచంద్రశేఖర్ (నాని), పంగా ఎర్రన్నాయుడు, చీకుర్తి ప్రదీప్‌కుమార్, పోలన సురేష్‌బాబు, యర్రపోతు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో పిచ్చిచెట్లు తొలగింపు



ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు హిందూ శ్మశాన వాటిక దుస్థితిపై, మరణించిన తమ ఆత్మీయుల పార్థీవ దేహాలకు దహన సంస్కారాలు నిర్వహించడానికి గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను కంకిపాడు మండల టిడిపి సీనియర్ నాయకులు యలమంచిలి కిషోర్ స్వామి ఇటీవల స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ వారు స్పందించి శ్మశాన వాటికలో అడ్డదిడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మలు, పిచ్చిమొక్కలు, గడ్డి దుబ్బులు వంటి వాటిని తొలగించి, పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవడం పట్ల కిషోర్ స్వామి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. బాగా దెబ్బతిన్న దహన వాటిక ఆవరణను కూడా సాధ్యమైనంత త్వరగా గొయ్యిని పూడ్చి, ఇబ్బందులను తొలగిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

మినుములో మేలైన యాజమాన్యంపై శిక్షణ

ప్రజాశక్తి-ఘంటసాల : ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల వారు కేవికే ప్రాంగణంలో ఫెర్టిలైజర్ అండ్ కెమికల్ ట్రావంకోర్ లిమిటెడ్ వారి సౌజన్యంతో మినుము పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెవికే సమన్వయ కర్త డా. డి. సుధా రాణి మాట్లాడుతూ మినుములో మేలైన విత్తన ఎంపిక చేసుకోవాలని, విత్తన శుద్ధి చేపట్టాలని, అధిక మోతాదులో రసాయనాలు వినియోగిస్తున్నారని, భూసారాన్ని పెంపొందించే విధంగా సేంద్రీయ ఎరువులపై దష్టి సారించాలని, రసాయనేతర పద్ధతులు అవలంభించి అవశేష రహిత పంట ఉత్పత్తులు పొందాలన్నారు. మినుములో మేలైన సస్యపోషణ చర్యల గురించి శాస్త్రవేత్త డా వెంకటలక్ష్మి వివరించగా, సస్యరక్షణ చర్యలు గురించి డా. రేవతి రైతులకు తెలిపారు. తదుపరి చర్చా గోష్ఠి కార్యక్రమాన్ని నిర్వహించగా రైతులు అడిగిన సందేహాలను కేవికే శాస్త్రవేత్తలు నివత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫాక్ట్ సిబ్బంది రాఘవేంద్ర, సాంబశివ రావు, కేవికే శాస్త్రవేత్తలు డా. మంజు వాణి, నవీన్, యశ్వంత్ కుమార్ పాల్గొన్నారు.

పంటల నష్టం జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని 16 రైతు సేవా కేంద్రాలలో మొంథా తుఫాన్ కారణంగా జరిగిన పంట నష్టం రైతుల జాబితా బుధవారం ప్రదర్శించారు. రైతులు ఏమైనా అభ్యంతరాలు ఉంటే గ్రీవెన్స్ రూపంలో సంబదిత గ్రామ వ్యవసాయ సహాయకులు ను సంప్రదించి సరిచేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి లోయ సునీల్ తెలిపారు. నష్టపోయిన ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హాస్టళ్లలో ఇంటి వాతావరణం ఉండాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి-పామర్రు : ప్రభుత్వ హాస్టల్లో ఉంటున్న విద్యార్థులకు ఇంటి వాతావరణం ఉండేలా అన్ని వసతులు కల్పించాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక టీకేఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోని ప్రభుత్వ బిసి కళాశాల హాస్టల్ ను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లోని కార్యాలయ రికార్డును, వసతులను ఎమ్మెల్యే పరిశీలించారు. విద్యార్థినిలతో ముఖాముఖి గా మాట్లాడి లోటు పాట్లను అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులను ఇంటిని వదిలి విద్యాభ్యాసానికి వచ్చిన సంగతి గుర్తుంచుకొని ఉన్నత స్థాయికి ఎదిగేలా ఒక గురి కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థిను లతో కలిసి హాస్టల్లోని భోజనాన్ని ఎమ్మెల్యే రుచి చూశారు. గుడివాడ డివిజన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సాల్మన్ రాజు, పామర్రు హెచ్ డబ్ల్యు ఓ వివి.శివ లక్ష్మీ కుమారి తదితరులు పాల్గొన్నారు.



మంచినీటి ట్యాంకుల పరిశీలన

ప్రజాశక్తి-ఉంగుటూరు : జిల్లా వైద్యాధికారి డాక్టర్ పి. యుగంధర్ ఇచ్చిన ఆదేశానుసారం ఆత్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్వైజర్ అంకూరి నాగ మల్లేశ్వరరావు బుదవారం పొట్టిపాడు గ్రామ పంచాయతీ ఇన్చార్జ్ సెక్రటరీ జె. యోహాన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ యం. దాలినాయుడులతో కలిసి పొట్టిపాడులోని ఆనంద పురంలో మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. ట్యాంకులు శుభ్రంగా ఉంచడంపై అవసరమైన సూచనలు చేశారు.

రేపు రెడ్ షర్ట్, శారీ వాలంటీర్ల కవాతు

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ

ప్రజాశక్తి-తిరువూరు: ఈ నెల 7న విజయవాడలో జరగనున్న రెడ్ షర్ట్ వాలంటీర్స్ కవాతును జయప్రదం చేయాలని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాత్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూస్వాముల, పెట్టుబడిదారుల నిరంకుశ పాలన నుండి పీడిత ప్రజలకు విముక్తి కలిగించిన రష్యా విప్లవం ప్రజా పోరాటాలకు దిక్సూచిగా నిలిచిందని పేర్కొన్నారు. రష్యా స్ఫూర్తితో విప్లవ ఉద్యమాలు ఉవ్వెత్తున లేచిన దేశాల్లో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చారని తెలిపారు. అటువంటి మహోత్తర రష్యా విప్లవ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో వందలాది మంది రెడ్ షర్ట్ వాలంటీర్లు కవాతు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరుగుతుందని, దీనికి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల నాగేంద్ర ప్రసాద్, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, నాయకులు పి.శ్రీనివాసరావు, ఎస్ కుమారి, బి.వెంకటేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వర్లు, ఎం.చింతయ్య, ఎస్‌కె నాగుల్ మీరా, ఎ.రవి, ఎస్వీ.భద్రం తదితరులు పాల్గొన్నారు. **గంపలగూడెం:** రెడ్ వాలంటీర్ల కవాతుకు సంబంధించిన కరపత్రాలను ఊటుకూరు గ్రామంలో పంపిణీ చేశారు. బుధవారం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గువ్వల సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పెనుగోలను, ఊటుకూరు, ఆర్లపాడు తదితర గ్రామాల్లో పర్యటించి కవాతును జయప్రదం చేయాలని కోరారు. ఈ మండల కమిటీ సభ్యులు మల్లవరపు కుటుంబరావు, ఎన్ జనార్ధన చారి, వి మాధవరావు, బండి వీరబాబు, బాణాల నాగపూర్ణ, పసుపులేటి వెంకటేశ్వర్లు, గద్దల శ్రీను, పలికంటి రాములు, పసుపులేటి మోహన్రావు, కోలా సులోమాను పాల్గొన్నారు. **నందిగామ:** నందిగామ సుందరయ్య కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కోట కళ్యాణ్ మాట్లాడుతూ 7న తుమ్మలపల్లి కళాక్షేత్రం నుండి జరిగే కవాతును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నందిగామ టౌన్ కార్యదర్శి కటారపు గోపాల్, పట్టణ కమిటీ సభ్యులు సయ్యద్ ఖాసిం, గోపి నాయక్, ఎవి నారాయణ, కర్రి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ



వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: భారత స్వాతంత్ర్య పోరాట యోధులు అంశంపై బాలోత్సవ వేదిక నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం గొల్లపాలెం గట్టు అరుణ కాన్వెంట్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 50వ డివిజన్ కార్పొరేటర్ బి.సత్యబాబు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సమాజాన్ని అధ్యయనం చేయాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను, వారి త్యాగాలను తెలుసుకోవాలని అన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదుతో పాటు ప్రతిభా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కెబిఎన్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ హేమచంద్, జెవివి నాయకులు మోసెస్, క్యాంపస్ ఇంచార్జ సతీష్, బాలోత్సవ కమిటీ బాధ్యులు కే వరలక్ష్మి, వి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు ఆలిండియా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-చందర్లపాడు: సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండల కేంద్రమైన చందర్లపాడులో స్థానిక పి హెచ్‌సిలో బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం యన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిత్యం పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు వేల్పుల రాణి, కష్టాల మేరి సుజాత, కమలమ్మ, అరిగెల చిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు బీరువా బహూకరణ

ప్రజాశక్తి-మైలవరం: స్థానిక మాదల బుల్లియ మెమోరియల్ జడ్పీ బాలికోన్నత పాఠశాలకు బీరువా అవసరాన్ని హెచ్‌ఎం రాజశేఖర్ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మైక్ బాబురావు దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించారు. మైలవరానికి చెందిన జిఎస్ఆర్ వెంచర్స్ ప్రతినిధులు స్పందించి పాఠశాలకు అవసరమైన బీరువాను బుధవారం అందజేశారు. దాతలను సత్కరించి అభినందనలు తెలిపారు.

విద్యార్థి వెంకటేష్‌కు అభినందన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మాక్ అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలను ధైర్యంగా ప్రస్తావించి, ప్రజల పక్షాన వాదించాలఅని స్థానిక శాసన సభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ సూచించారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం నిర్వహించనున్న మాక్ అసెంబ్లీకి రామచంద్రాపురం గ్రామానికి చెందిన నకరికంటి వీరబాబు కుమారుడు వెంకటేష్ ఎంపికయ్యారు. వత్సవాయిలో మహాత్మా జ్యోతిరావు పూలే ఏపీ బీసీ వెల్ఫేర్ బాయ్స్ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న వెంకటేష్‌ను ఎమ్మెల్యే తన నివాసంలో బుధవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో సంకా వెంకట్రావు, జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అన్నెపాగ కాంతారావు, న్యాయవాదులు ఆలేటి కిషోర్, మన్నేపల్లి బసవరాజు, ఆనంద్, భరత లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



హ్యుందాయ్ వెన్యూ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: విజయవాడ ప్రసాదంపాడులోని లక్కీ హ్యుందాయ్ షోరూమ్‌లో హుందాయ్ వెన్యూను బుధవారం ఆవిష్కరించారు. భారత చెస్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి కొత్త మోడల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్కీ హ్యుందాయ్ మేనేజింగ్ డైరెక్టర్ మిస్టర్ సందీప్ ఉస్మాన్ మాట్లాడుతూ ఆల్ న్యూ హుందాయ్ వెన్యూ భద్రత, టెక్నాలజీ, సౌకర్యాల విషయంలో కొత్త ప్రమాణాలను స్థాపించిందన్నారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని డిజైన్ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పవర్‌లిఫ్టర్ అండ్ వెయిట్‌లిఫ్టర్ మిస్ సాదియా అల్మాస్ షేక్, రాష్ట్ర అధికార ప్రతినిధి కె.నాగుల్‌మీరా, జనరల్ మేనేజర్ రోహిణీ కుమార్, సేల్స్ హెడ్ శ్రీనుబాబు, సీనియర్ మేనేజర్ డి.ధీరజ్ స్వరూప్, ఇన్‌స్టిట్యూషనల్ హెడ్ అఖద్ ప్రతాప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



రైతు సేవా కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-వత్సవాయి

రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అలవర్చుకోవాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. మండలంలోని రైతు సేవా కేంద్రాన్ని ఆర్డీవో బాలకృష్ణతో కలిసి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఇంకా వెంకటేశ్వరావు, నీటి సంఘం అధ్యక్షులు గింజుపల్లి వెంకటయ్య, ఆనందరావు తాసిల్దార్ శాంతిలక్ష్మి, ఎంపీడీవో జి.శ్రీను, వ్యవసాయ శాఖ అధికారి రామ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

స్నానఘాట్లు పరిశీలన

ప్రజాశక్తి-విజయవాడ సిటీ

కార్తీక పౌర్ణమి సందర్భంగా నది ఘాట్ల వద్ద వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బంది కలగరాదని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం తన పర్యటనలో భాగంగా కృష్ణవేణి ఘాట్, వినాయకుని గుడి, కెనాల్ రోడ్, దుర్గాఘాట్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఘాట్ల వద్ద పారిశుధ్య నిర్వహణ కచ్చితంగా జరగాలని, తాత్కాలిక మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పెదపారుపూడి పిఎస్‌లో డిఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి-పెదపారుపూడి(గుడివాడ) : పెదపారుపూడి పోలీస్ స్టేషన్‌లో గుడివాడ డి.ఎస్.పి ధీరజ్ వినీల్ బుధవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ రికార్డులను పరిశీలించడంతోపాటు ఎస్సై, సిబ్బందితో స్టేషన్ స్థితిగతుల గూర్చి చర్చించారు. అనంతరం డిఎస్‌పి విలేకరులతో మాట్లాడుతూ వార్షిక తనిఖీలో భాగంగా స్టేషన్‌కు విచ్చేయడం జరిగిందన్నారు. ఈ స్టేషన్ ఎస్సై, సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, కేసుల వివరాలను పరిశీలించినట్లు తెలిపారు. మిగతా పోలీస్ స్టేషన్‌లలో కంటే ఈ స్టేషన్లో కేసుల నమోదు తక్కువగా ఉంటుందని, ఉన్న కేసుల విషయంలో కూడా సిబ్బంది పనితీరు సక్రమంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పామర్రు సీఐ వి.శుభాకర్, ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ట్రైనింగ్ ఎస్సై విజయభాస్కర్, ఏఎస్ఐపి ప్రకాష్‌రావు, రైటర్ జి నాగమల్లేశ్వరరావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

యుబిఐ కార్యాలయంలో రక్తదానం

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : వన్‌టౌన్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. యూబీఐ 107వ స్థాపన దినోత్సవం, విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. యూబీఐ ప్రాంతీయ కార్యాలయం, జోనల్ కార్యాలయానికి చెందిన అధికారులు, సిబ్బంది ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్, డిప్యూటీ జోనల్ హెడ్ ఎంవీఎన్ రవిశంకర్, డిప్యూటీ రీజనల్ హెడ్లు బి.రవి రాజు, వి.చందన శ్రీరూప పాల్గొన్నారు.



ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తిరువూరు

తిరువూరులో వచ్చే 5, 6 తేదీల్లో జరగనున్న ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా 53వ మహాసభను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వరరావు కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మహాసభల వాల్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. గత నాలుగు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిగా ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులు అప్పు చేసి ఫీజులు కట్టాల్సిన పరిస్థితి వస్తుందని, ఫీజులు కట్టలేని విద్యార్థులు చదువులు మానేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని, హాస్టల్ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించి, కాస్మొటిక్, మెస్ చార్జీలు పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు బి.వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి సిహెచ్.మోహన్‌కృష్ణ, మండల నాయకులు సాయితేజ, రాజేష్, జగదీష్, చైతన్య, యశ్వంతి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఓబన్న విగ్రహానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-రెడ్డిగూడెం

మండల పరిధిలోని ముచ్చనపల్లి గ్రామంలో ఒడియా రాజుల కమ్యూనిటీ హాలు విస్తరణతో పాటు ఒడియా రాజుల ముద్దుబిడ్డ, ప్రముఖ స్వతంత్ర సమరయోధులు వడ్డే ఓబన్న విగ్రహ శంకుస్థాపన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎపి ఒడియా రాజుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర్, డైరెక్టర్ మహాలక్ష్మి, విగ్రహదాత వేముల బాబు, పెద్దలు బండారు సత్యనారాయణ, లక్ష్మీపతి టీచర్, ముచ్చినపల్లి గ్రామ సర్పంచ్ దేవల జమ్మలయ్య పాల్గొన్నారు.